పల్లెల్లో ఊపందుకున్న ‘ఉపాధి’

- వ్యవసాయ పనులు ముగియడంతో పెరిగిన కూలీల సంఖ్య
- క్లస్టర్ పరిధిలో 53,278 కుటుంబాలు,1,05,611 కూలీలకు లబ్ధి
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.16.72 కోట్లు కేటాయింపు
- గుర్తించిన పనులు 7,877, పూర్తయినవి 1,950



హొలహర్వి వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఆలూరు రూరల్: రబీ సీజన్ ముగియడంతో పల్లెల్లో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. గత ప్రభుత్వం హయాంలో అరకొర పనులు కల్పిస్తుండడంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారు. వలసల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీలకు వంద రోజుల పని కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తుండటంతో దాదాపుగా వలసలు తగ్గాయి. ముఖ్యంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించేలా అధికారులకు లక్ష్యం నిర్దేశించింది. అలాగే గుర్తించిన పనులు ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా పూర్తి చేసేలా ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.ఉపాధి హామీ పథకం క్లస్టర్ పరిధిలోని ఆలూరు, ఆస్పరి, హొళగుంద, హాలహర్వి, మండలాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేసి పనులు ప్రారంభించారు.

2022-23లో రూ.16.72 కోట్లు ఖర్చు..

కూలీలు,రైతుల వినతుల మేరకు 7,877 పనులు గుర్తించారు. ప్రస్తుతం 1,950 పనులు పూర్తయ్యాయి. 5,927 పనులు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనుల కోసం ఉన్నతాధికారులు 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీల కోసం రోజుకు రూ.242 చొప్పున అందించేందుకు రూ.16.72 కోట్లు కేటాయించారు. రైతుల పొలంలో గట్లు వేయడం, ఫాంపాండ్, డగౌట్ గుంతల నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్, పండ్ల తోటల పెంపకం, గట్టు చుట్టూ మొక్కలు నాటడం, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం, చెరువులు, బావుల్లో పూడికతీత, చెత్త సంపద కేంద్రాల నిర్మాణం, వంకల మరమ్మతులు వంటి తదితర పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి కూలీలకు పనులు కల్పిస్తున్నారు.

పెరిగిన కూలీల సంఖ్య..

2022-23 ఏడాదిలో జనవరి నాటికి రబీ సీజన్ ముగిసింది. పొలాల్లో పంటలు ఉన్నందుకు కొంత మంది వారి పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకునే వారు. డిసెంబర్ నెల చివరి నుంచి జనవరి నెల 15 వరకు పంట దిగుబడులు కోత కోసేందుకు వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉండేది. వీరికి రోజు చొప్పున రూ.300 నుంచి రూ.350 వరకు కూలి లభించేది. దీంతో పల్లెల్లో వ్యవసాయ కూలీలు పత్తి, పప్పు శనగ పంట తీయడానికి వెళ్లేందుకు వెళ్లేవారు. దీంతో ఉపాధి పనికి వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గింది. వ్యవసాయ పనులు ముగియడంతో ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. ఆలూరు ఉపాధి హామీ పథకం క్లస్టర్ పరిధిలోని 5 మండలాల్లో 53,278 కుటుంబాలు ఉన్నాయి..ఇందులో డిసెంబర్ నెలలో 72,641 మంది కూలీలు పనులకు రాగా.. ఫిబ్రవరి నెల 24వ తేదీ నాటికి కూలీల సంఖ్య 1,05,611కు పెరిగింది. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు జాబ్ కార్డు కలిగిన వారందరికీ పనులు కల్పించాలని, గుర్తించిన పనులు పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఈసీలు, ఏపీఓలను ఆదేశించారు.

రోజూ పని కల్పిస్తున్నారు



మా గ్రామంలో రోజు ఉపాధి పని కల్పిస్తున్నారు. పొలం గట్లు వేయడం, నీళ్ల గుంతలు తవ్వడం పనులు చేస్తున్నాం. కూలి గిట్టుబాటు అవుతోంది. పని కోసం ఏ ఊరికి వలస వెళ్లాల్సిన అవసరం లేదు. అడిగిన వెంటనే పనులు కల్పిస్తున్నారు.

– గాదిలింగప్ప,ఆరికెర,గ్రామం

పారదర్శకంగా పనులు

ఆలూరు ఉపాధి క్లస్టర్ పరిధిలోని 5 మండలాల్లో చేపట్టిన పనులు పారదర్శకంగా చేపట్టాం. ఈ ఏడాదికి 7,877 పనులు గుర్తించాం. ఇందులో 1,950 పనులు పూర్తయ్యాయి. 5,927 పనులు జరుగుతున్నాయి. జాబ్ కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తాం. ఏ కుటుంబం వలస వెళ్లడానికి వీల్లేకుండా పనులు కల్పిస్తాం.

– మల్లేశ్వరి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్,ఆలూరు

క్లుప్తంగా

నాణ్యతతో సీసీ రోడ్ల నిర్మాణాలు



18వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమీషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 18వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ భీమన్నకు సూచించారు. ప్రస్తుతం నిర్మించే రోడ్డుకు డ్రైన్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ న్యామతుల్లా, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తుగ్గలి : క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం ఉమ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చందునాయక్ సొంత డబ్బులతో సమకూర్చిన క్రీడా దుస్తులను బుధవారం ఖోఖో క్రీడాకారులకు హెచ్ఎం అందజేశారు. క్రీడల్లో క్రీడాకారులకు మంచి తర్ఫీదు ఇవ్వడమే కాకుండా వారి కోసం ఫిజికల్ డైరెక్టర్ సొంత డబ్బులు ఖర్చు చేస్తుండడం అభినందనీయమన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

మద్దికెర: రైతులకు సంబంధించిన పొలాల రికార్డులు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా ఉంటేనే ప్రభుత్వం అందించే రైతుభరోసా, వడ్డీ లేని రుణాలు, పీఎం కిసాన్ వంటి సబ్సిడీ పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ భూసర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చేటప్పుడు భూములు విధంగా సంక్రమించాయో రికార్డుల్లో ఉండాలని చెప్పారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్ఓలు పక్కీరప్ప, రంగస్వామి, రషీద్, బాలవర్ధిరాజు, శివన్న, శ్రీరాములు, హర్షవర్ధన్ పాల్గొన్నారు.


శనగ కొనుగోళ్లు నిలిపివేత

ఆలూరు రూరల్: రాష్ట్రంలో వర్ష సూచన ఉన్నందున ఈ నెల 20వ తేదీ వరకు మండలంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న శనగ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ ప్రకాష్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లింగ్ వేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ తర్వాత యథావిధిగా కొనుగోళ్లు చేపడతామని, రైతులు గమనించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

హొళగుంద: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని చిన్నహ్యాట వీఏఏ తస్లీమా అన్నారు. బుధవారం చిన్నహ్యాట గ్రామ పరిధిలోని శేఖరప్ప అనే రైతుకు చెందిన వేరుశనగ పంట పొలంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాలు తయారు చేసుకోవడంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ పద్ధతిలో పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులు అధికంగా వస్తాయని, మార్కెట్‌లో ఈ ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉంటంతో రైతులకు అధిక లభిస్తుందని చెప్పారు.

హుండీ కానుకల లెక్కింపు



కైరుప్పలలో కానుకలను లెక్కిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో నున్న వీరభద్రస్వామి ఆలయంలో ఈఓ రాం ప్రసాద్ సమక్షంలో గ్రామస్తులు బుధవారం హుండీ కానులకను లెక్కించారు. లెక్కింపులో రూ.3,34,810 ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరీక్షల వేళ ఆరోగ్యం జాగ్రత్త



కేజీబీవీలో బాలికల ప్రిపరేషన్ పరిశీలిస్తున్న జీసీడీఓ సునీత

కృష్ణగిరి: ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు, రాబోవు పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వసతి గృహాలు, సంక్షేమ పాఠశాలల అధికారులు బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జీసీడీఓ సునీత తెలిపారు. బుధవారం స్థానిక కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి బాలికలతో మాట్లాడారు. వారికి అందించిన భోజనాన్ని పరిశీలించి, పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విధానాన్ని తెలుసు కుని సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకునేలా బాగా కష్టపడి చదవాలని, బంగారు భవిష్యత్‌కు అదే మార్గమవుతుందని విద్యార్థినులకు సూచించారు. ఎస్‌ఓ సునీత ఉన్నారు.

పన్నులు వసూలు చేయాలి

గోనెగండ్ల: ఇంటి, కుళాయి, షాపులు తదితర వాటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం -1,2లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల చివరి లోపు వందశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే సచివాలయంలో అందించే సేవల గుచించి అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ హైమవతి, పీఎస్ వెంకటేష్ పాల్గొన్నారు.

సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దులు ఏర్పాటు చేయండి



బనవాసిలో సర్వే పూర్తయిన పొలంలో హద్దులు వేయిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్ – జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని బనవాసి గ్రామంలో రీసర్వే పూర్తయిన పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూ రక్ష రీసర్వే ఇప్పటి వరకు 58 గ్రామాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన గ్రామాల్లో రైతులకు తమ పొలంలో హద్దుల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రీసర్వేలో ఏవేనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వేతో భూ రికార్డులు, హద్దులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు వేణు సూర్య, శ్రీనివాసులు, మండల సర్వేయర్లు అశోక్, రమణ, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఆలూరు రూరల్: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను ఏడాది లోపు పూర్తి చేయాలని కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఆలూరు నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఆయా బ్యాంకుల పరిధిలో రైతులకు క్రాప్ లోన్, డ్వాక్రా సంఘాల రుణాలు, వివిధ రంగాల అనుబంధ సేవల రుణాలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. 2023 ఆర్థిక సంవత్సరానికి రూ.4,394.47 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.4,048.49 కోట్ల రుణాలను మంజూరు చేశారన్నారు. అలాగే పంట రుణాల కోసం రూ. 106.39 కోట్లకు గాను రూ.38.39 కోట్లు అందించినట్లు చెప్పారు. వివిధ రకాల అనుబంధ రంగాలకు అందించే రుణాలు రూ.179.38 కోట్లకు గాను రూ.187.82 కోట్లు మంజూరు చేయగా.. సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రూ.1308.20 కోట్లు టార్గెట్ ఇవ్వగా రూ.1425.51 కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. మిగిలిన రుణ లక్ష్యాలను అర్హులైన వారికి అందించి పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ కన్వీనర్ నెహామతుల్లా, జిల్లా ఛీఫ్ మేనేజర్ ఆర్ శెట్టి, అన్ని బ్యాంకుల మేనేజర్లు, డీఆర్‌డీఏ, వైకేపీ అధికారులు హాజరయ్యారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కృష్ణగిరిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ పురుషోత్తం



ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు



సమయం దగ్గర పడుతుండడంతో ఎగ్జామ్ సెంటర్ వైపు పరుగులు తీస్తున్న విద్యార్థులు

గోనెగండ్ల: స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. తెలుగు పరీక్షకు 215 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 206 మంది హాజరయ్యారు. పరీక్ష సమయంలో కళాశాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో పోలీసులు పరీక్ష కేంద్రం పరిసరాల్లో ఇతరులను ఎవరిని అనుమతించలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎగ్జామినర్ చీఫ్ సూపరింటెండెంట్ రవిచంద్ర తెలిపారు.

తుగ్గలి : ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభ మయ్యాయి. స్థానిక అనసూయ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 126 మంది విద్యార్థులకు గాను 113 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్, డిపార్టుమెంట్ అధికారులు కిరణ్మయి, రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

చిప్పగిరి: స్థానిక కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు తొలిరోజు 94 మంది హాజరు కావాల్సి ఉండాగా 91విద్యార్థులు హాజరయ్యారు. 29వ తేదీ వరకు జరగనుండగా, ఈ నెల 16వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి.

ఆలూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో 419 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పరీక్ష రాశారు. ఆయా సెంటర్ల డిపార్ట్‌మెంట్ చీఫ్‌లు శంకర్ ప్రసాద్, వీరేష్ పర్యవేక్షించారు. ఆలూరులోని జూనియర్ కళాశాలలో మొదటి రోజు 249 మంది విద్యార్థులకు గాను 238 మంది, ఏపీ మోడల్ పాఠశాలలో 190 మందికి విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా..181 మంది హాజరయ్యారు. నేడు జరిగే ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలకు రెండు సెంటర్లలో 644 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్లో బుధవారం ప్రారంభమైన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలను తహసీల్దార్ పురుషోత్తం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి రోజు లాంగ్వేజ్ పరీక్షలను 253 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం సీఎస్ విశ్వేశ్వరయ్య, డీఓ చౌడప్ప తెలిపారు.

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరానికి చెందిన మొత్తం 220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైరాజరయ్యారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా సంజన్న, చీఫ్‌గా శశికుమార్ వ్యవహరించారు.

ఆస్పరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 242 మంది విద్యార్థులకు గాను 230 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహులు తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి,స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాలతో పాటు బాలికల, రాఘవేంద్ర, నలంద, నారాయణ, వైష్ణవి కళాశాలల్లో 2,140 మంది మొదటి రోజు పరీక్షలకు హాజరుకాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల విభాగ అధికారులు పేర్కొన్నారు.

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. 178మంది విద్యార్థులకు గాను ఆరుగురు గైర్హాజరైనట్లు చీఫ్ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ చంద్రకాంత్ తెలిపారు.

వ్యక్తి హత్యపై విచారణ

తుగ్గలి : పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో మంగళవారం రాత్రి జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్యపై తుగ్గలి పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బుధవారం ఎస్ఐ మల్లికార్జున తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తికి 42 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. హత్యకు ముందు ఉదయం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో దుస్తులు సరిగా లేక సంచరించినట్లు సీసీ పుటేజ్, గ్రామస్తులు ద్వారా తెలుసుకున్నారు. దీన్ని బట్టి హతుడు మానసిక స్థితి బాగా లేదని తెలుస్తోంది. అయితే మానసికస్థితి బాగా లేని వ్యక్తిని చంపాల్సిన అవసరం ఎవరికి, ఎందుకు అవసరం ఉందనేది చర్చనీయాంశమైంది. ఏ ప్రాంతం నుంచి ఇక్కడి వచ్చాడు అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎలాంటి ఆనవాళ్లు లభించక పోవడంతో హత్య కేసును ఛేదించేందుకు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంచాలి

మద్దికెర : మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కోరారు. ఈ మేరకు బుధ వారం తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన స్థలాలు కొంతమందికి మాత్రమే ఇచ్చారని, ఇంకా చాలా మంది ఇళ్లు పేదలున్నారని, వారందరికీ స్థలం ఇచ్చి ఇంటిని నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మందులతో క్షయ నయం

మద్దికెర : క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందజేయాలన్నారు. దీర్ఘకాలంగా దగ్గు, తరుచుగా సాయంత్రం పూట జ్వరం, బరువు తగ్గుట, దగ్గితే రక్తం పడటం, ఛాతిలో నొప్పి, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నయం అయ్యేంతవరకు ఉచితంగా మందులు ఇస్తామని చెప్పారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెల్త్ సెక్రటరీ గాయత్రి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న శ్రీనివాసులు

ఆలూరు: దేవనకొండ మండలంలో కొలువుదీరిన శ్రీ గద్దెరాళ్ల మారెమ్మకు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున తదితరులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఆహ్వానం పలికారు. కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఉమాంబ, లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా మారికాంబిక దేవర



హొళగుంద: మండలంలోని ఇంగళద హాళ్ గ్రామంలో వెలిసిన మారికాంబిక దేవరలో భాగంగా బుధవారం కుంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం గంగపూజ నిర్వహించిన గ్రామస్తులు అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి కుంభాన్ని ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములవ్వండి



ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్



సోమప్ప సర్కిల్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పట్టణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సీఐ మధుసుదన్‌రావు, ఎంఈఓ ఆంజనేయులు కోరారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మాచానిసోమప్ప బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్‌పై ఎన్‌సీసీ విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సోమప్ప సర్కిల్ వద్దకు సాగింది. ఇందులో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిశుభ్రత తదితర అంశాలపై సర్కిల్‌లో చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సోమప్ప సర్కిల్ వద్ద పైలాన్ల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.హెచ్ఎం గౌసియాబేగం, ఎన్‌సీసీ హవాల్దార్లు సురేష్, సుజిత్, పీడీలు సుజన పాల్గొన్నారు.

ముళ్ల కంపల తొలగింపు



రోడ్డుకిరువైపులా ముళ్ల కంపలను తొలగిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని చుంచు ఎర్రగుడి నుంచి కంబాలపాడు వరకు 7కి.మీ మేర రహదారి ఇరువైపులనున్న కంపచెట్ల తొలగింపు బుధవారం వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి సొంత ఖర్చుతో చేపట్టారు. కంపచెట్లతో రహదారి మూసుకుపోవడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తాను ఈ పని చేపట్టినట్లు లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. వాహనదారులు, ఇరు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

రాకపోకలు బాగుండేలా చూడాలి



అల్లుగుండు రైల్వే లెవల్ క్రాస్ వద్ద రైల్వే, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

వెల్దుర్తి: తమ పొలాలన్నీ రైల్వే లైన్ అవతలనే ఉన్నాయని, ఆకస్మాత్తుగా రైల్వే లెవల్ క్రాసింగ్ మూసివేస్తే తమ పరిస్థితి ఏమిటని, అండర్‌వే నిర్మించినా తమ రాకపోకలు బాగుండేలా మాత్రమే చర్యలు తీసుకోవాలని అల్లుగుండు రైతులు రైల్వే అధికారులతో వాదించారు. అల్లుగుండు గ్రామం నుంచి హైవే దాటుకుని తూర్పు వైపున వేల ఎకరాల పొలాలకు 149 నంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ ద్వారా దారి ఉంది. ఈ క్రాసింగ్‌ను ఇటీవల హైటెన్షన్ వైర్ల పనుల నేపథ్యంలో రైల్వే అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. అంతే కాకుండా ఈ క్రాసింగ్‌ను తొలగించి మరో చోట అండర్ వే నిర్మించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలుసుకున్న గ్రామ రైతులు రైల్వే, రెవెన్యూ అధికారులకు తమ ఇబ్బందులపై ఫిర్యాదు అందించారు. ఈ మేరకు బుధవారం రైల్వే కర్నూలు ఎస్ఈ రవిశంకర్, వెల్దుర్తి తహసీల్దార్ రాజేశ్వరి, సర్వేయర్ హేమంత్ కుమార్ రెడ్డి 149 రైల్వే లెవల్ క్రాసింగ్ వద్దకు చేరుకుని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు శ్రీరాంరెడ్డి రైతులు మాట్లాడుతూ వేల ఎకరాలున్న తమ పొలాలకు వెళ్లేందుకు దారి బాగుండేలా మాత్రమే చర్యలు తీసుకోవాలని మూకుమ్మడిగా తెలిపారు. సమీప అండర్‌వే ద్వారా రాకపోకలు కలి్పంచే ఆలోచన విరమించుకోవాలని, అక్కడ నీటి నిలువతో రాకపోకలు సాగించడం తీవ్ర కష్టతరంగా ఉంటుందని చెప్పారు. దీంతో రైల్వే, రెవెన్యూ అధికారులు మరో మార్గాన్ని పరిశీలించారు. మొత్తంగా రైతులకు అనుకూలంగా పొలాలకు వెళ్లే వీలు కలిగేలా తమ ప్రతిపాదనలు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. త్వరలో రైల్వే లెవలింగ్ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి తమ నివేదిక అందిస్తారని రైల్వే ఎస్ఈ తెలిపారు.

పాదయాత్ర భక్తులకు వైద్య సేవలు



పాదయాత్ర భక్తులకు వైద్య సేవలందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది

నందవరం : ఉగాది వేడుకల సందర్భంగా శ్రీశైలం వెళ్తున్న కర్ణాటక పాదయాత్ర భక్తులకు స్థానికులు వైద్య సేవలు, అన్నదానం చేస్తున్నారు. మండలంలోని పొనకలదిన్నె గ్రామంలో శ్రీధర్ స్వామి నేతృత్వంలో కన్నడిగులకు రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బందితో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే భక్తులకు గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలి



నూతన కమిటీ సభ్యులతో మనోహర్

గోనెగండ్ల: వీరశైవులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓబీసీలుగా గుర్తించాలని వీరశైవ సంఘం జాతీయ సలహాదారుడు మనోహర్, రాష్ట్ర కన్వీనర్ అమరేశప్ప, రాష్ట్ర అధ్యక్షుడు దేవేంద్రగౌడ్ కోరారు. బుధవారం స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో వీరశైవ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో వీరశైవులు అర్చకులుగా మారి బతుకు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనకబడిపోయారని, ఆదుకోవాలని కోరారు. గోనెగండ్లలో వీరశైవులకు శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని,అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా శివయ్యస్వామి, దేవయ్యస్వామి, అధ్యక్షుడిగా అమరేష్, ఉపాధ్యక్షుడిగా శిల్పి శ్రీనివాసులు, ఆర్గనైజర్స్ వీరేష్, జగదీష్, రాకేష్, బసవరాజు, కన్వీనర్స్‌గా రాజశేఖర్, సోమేష్, రవి, ఉపేంద్ర, సెక్రటరీలుగా బసవరాజు స్వామి, నాగేష్‌ను ఎన్నుకున్నారు.